క్లుప్తంగా

వైభవంగా నమ్మాళ్వార్ పరమపదోత్సవం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నమ్మాళ్వార్ పరమపదోత్సవం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, భరద్వాజ్, దివ్య ప్రబంధం అధ్యాపకులు నందకిషోర్, రంగనాథ చార్య ఆధ్వర్యంలో వేదమంత్రాలు నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం గర్భాలయంలో పారాయణం, పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు గాయాపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మూకమామిడి ప్రాజెక్ట్ సమీపంలో ఏకలవ్య పాఠశాల నూతన భవనం నిర్మిస్తుండగా, పాల్వంచకు చెందిన అమల్‌మండల్, సోమ్‌వీర్‌లు కూలీలుగా పనిచేస్తున్నారు. రోజూలాగానే పనిముగించుకుని బుధవారం సాయంత్రంవేళ ద్విచక్ర వాహనంపై పాల్వంచకు వెళుతున్నారు. ఈ క్రమంలో మాధారం అటవీ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న కారు, బైక్ ఢీ కొన్నాయి. ప్రమాదంలో ఇరువురికీ తీవ్రగాయాలు కాగా, 108 వాహనంలో పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి, అటు నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుండాల-మేడారం బస్సు ప్రారంభం



మేడారం బస్సును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

గుండాల: మండల కేంద్రం నుంచి మేడారం వెళ్లడానికి భక్తుల సౌకర్యార్థం హన్మకొండ డిపోకు చెందిన బస్సుని బుధవారం స్థానిక సీఐ రవీందర్, మండల పరిషత్ అధ్యక్షుడు ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్కలు ప్రారంభించారు. ఈ బస్సు పసరలో ఉదయం 9:30కి బయలుదేరి.. గుండాల వస్తుందని, ఉదయం 11 గంటలకు గుండాల నుంచి మేడారానికి బయలుదేరుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గుండాల సర్పంచ్ కోరం సీతారాములు, ముత్తాపురం సర్పంచ్ పునెం సమ్మయ్య, రోళ్లగడ్డ సర్పంచ్ అజ్మీర మోహన్, ఎంపీటీసీలు కృష్ణారావు, రాజేశ్వరి, దొంగతోగు సర్పంచ్ బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహాల ఆవిష్కరణ

దమ్మపేట: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. బుధవారం మండలంలోని పట్వారిగూడెం, జగ్గారం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల ఆవరణలో సరస్వతి మాత విగ్రహాలను వాసవీ క్లబ్ బాధ్యుల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ దొసపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. చదువుల తల్లి ప్రతీకగా సరస్వతి అమ్మవారి విగ్రహాలను పాఠశాలల్లో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ చదువుల తల్లి నీడలో ఉత్తమ విద్యను అభ్యసించిన విద్యార్థులు, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు దారా మల్లిఖార్జునరావు, దారా నరసింహారావు, పెండ్యాల రాజ్యలక్ష్మి, జంగాల రాము, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయానికి చేరిన అక్షింతలు

దమ్మపేట: అయోధ్య రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి పంపిన శ్రీరాముడి అక్షింతలు, మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయానికి బుధవారం చేరాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో అక్షింతలను శోభాయాత్రగా దమ్మపేట గ్రామానికి తీసుకురావడం జరిగింది. గ్రామ పెద్దలు, విశ్వ హిందూ పరిషత్, ఆలయ కమిటీ సభ్యులు ఈ శోభాయాత్రలో పాల్గొని, అక్షింతలను వేణుగోపాలస్వామి ఆలయంలో భద్రపరిచారు. గ్రామంలో స్వామివారి అక్షింతలను అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

ములకలపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటినుండి జరుగనున్న గ్రామసభల్లో ప్రజలు దరఖాస్తులు అందజేయాలని కోరారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు కరుటూరి కృష్ణ, గాడి తిరుపతిరెడ్డి, సురభి రాజేశ్, సాధం శ్రీను, కొర్రి శివ పాల్గొన్నారు.

మన్యంపై చలి పంజా

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పొగమంచుతో వాహన రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న పిల్లలు, వృద్ధులు
- ఉద్యోగులకు తప్పని తిప్పలు



అంబేడ్కర్ సెంటర్‌ను కప్పేసిన పొగమంచు



పొగమంచులో లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం మన్యంపై చలి పంజా విసురుతోంది. అర్ధరాత్రి నుంచి మొదలవుతున్న పొగ మంచు ఉదయం పది గంటల వరకు తగ్గడం లేదు. దీంతో వాహన రాకపోకలను తీవ్ర ఇబ్బందిలు కలుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఏజెన్సీలో వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. చలి కారణంగా వృద్ధులు, పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈశాన్యం నుంచి వీస్తున్న చల్లని గాలుల కారణంగా ఉష్ణోగ్రతలు తగ్గుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు. దీంతో భద్రాచలం ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. చలి తీవ్రతతో పట్టణంతో పాటు ఏజెన్సీలోని గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటల వరకు చలి ప్రభావం తగ్గడం లేదు. సాయంత్రం 5 దాటితే ఈదురు గాలులతోపాటు వాతావరణం పూర్తిగా చల్లబడిపోతోంది. ఆ సమయాల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావడంలేదు. ఉదయం పూట ఏజెన్సీ గ్రామాల్లో చలికి తట్టుకోలేక చలి మంటలు వేసుకుంటున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు సైతం కనిష్ఠ స్థాయిలో నమోదు అవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వృద్ధులు, పిల్లలపై తీవ్ర ప్రభావం

చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఉదయం ఏడు గంటలలోపే బయల్దేరాల్సి రావడంతో చలితో ఇబ్బంది తప్పడం లేదు. పాఠశాలలకు వెళ్లేటప్పుడు, సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో వాతావరణం చల్లబడుతుండటంతో గజగజ వణికిపోతున్నారు. వృద్ధులు, యువకులు చలి నుంచి తట్టుకోలేక స్వెటర్లు, మఫ్లర్లు వదలడం లేదు. చలి మంటలు కాగుతూ రక్షణ చర్యలు పాటిస్తున్నారు. ఉబ్బసం, ఆయాసం ఉన్న వారి బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఉన్ని దుస్తువులు అమ్మే దుకాణాలు ప్రజలతో రద్దీగా కనిపిస్తున్నాయి.

చిరువ్యాపారులు, ఉద్యోగుల ఇక్కట్లు

చలి తీవ్రత పెరగడంతో ఉద్యోగులతో పాటు పట్టణంలో ఉదయం పూట చిరు వ్యాపారాలు నిర్వహించేవారు ఇబ్బందులు పడుతున్నారు. భద్రాచలం కేంద్రంగా నివసిస్తూ ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే వారు చలికి తట్టుకోలేక పోతున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు, ఐటీసీ కార్మికులు విధులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం, రాత్రి షిఫ్టులకు వెళ్ళే కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. తెల్లవారుజామున పొగ మంచు పడుతుండడంతో రోడ్డు కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



చలికాలం వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్త వహించాలి. చలికాలంలో పిల్లల విషయంలో తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలి. చిన్న పిల్లలను ఉదయం పూట ఎండకు వుంచడం మంచిది. పిల్లలను బయటకు తీసుకువెళ్లే సమయంలో తప్పకుండా వెచ్చని దుస్తులను ధరింపజేయాలి.

– డాక్టర్ వై.రాజశేఖరరెడ్డి, పిల్లల వైద్య నిపుణుడు, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

మణుగూరులో ఐఎన్‌టీయూసీ విజయం

- ప్రశాంతంగా సింగరేణి ఎన్నికలు
- ఏరియాలో 97శాతం పోలింగ్ నమోదు



ఓటు హక్కు వినియోగించుకునేందుకు లైన్‌లో నిలుచున్న సింగరేణి ఉద్యోగులు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో జరిగిన గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. ఎంతో ఉత్కంఠభరితంగా సాగిన కౌంటింగ్‌లో ఐఎన్‌టీయూసీ సమీప అభ్యర్థి ఏఐటీయూసీపై రెండు ఓట్ల స్వల్ప ఆధిక్యంతో విజయం సాధించినట్లు ఆర్డీఓ మంగీలాల్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి తివారీ తెలిపారు. కౌంటింగ్‌లో తొలుత ఏఐటీయూసీ తన ఆధిపత్యాన్ని కనబర్చినప్పటికీ... చివరి క్షణాల్లో ఐఎన్‌టీయూసీ పుంజుకుని గెలుపును కైవసం చేసుకుంది. ఐఎన్‌టీయూసీ 778 ఓట్లను సాధించగా.. ఏఐటీయూసీ 776 ఓట్లు, టీబీజీకేఎస్ 728, సీఐటీయూ 66, హెచ్ఎంఎస్ 13, బీఎంఎస్ 7, ఐఎఫ్‌టీయూ 3, టీఎన్‌టీయూసీ 1, చెల్లనివి 6గా పోలయ్యాయి. సింగరేణి గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గెలుపొందడం పట్ల యూనియన్ శ్రేణుల్లో, కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం మిన్నంటింది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేస్తూ.. ఐఎన్‌టీయూసీ నాయకులకు శుభాకాంక్షలు, ఏరియా కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు.

ఓటింగ్ ఇలా సాగింది..

సింగరేణి కాలరీస్ కాలరీ మణుగూరు ఏరియాలో గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఏరియాలో ఎన్నికల నిర్వహణ కోసం ప్రాజెక్ట్ ఆఫీస్‌లో రెండు, కేసీహెచ్‌పీ మ్యాన్‌వే ఆఫీస్, ఓసీ-4 మైన్ ఆఫీస్, కొండాపురం భూగర్భగని మైన్ ఆఫీస్, సింగరేణి గెస్ట్ హౌజ్, మణుగూరు ఓసీ సేఫ్టీ ఆఫీసర్ రూమ్‌లలో ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,450మంది ఉద్యోగ ఓటర్లలో 2,378 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం ఉదయం 7గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా.. 13 యూనియన్లు ఎన్నికల బరిలో ఉన్నాయి. పోలీస్, సింగరేణి సెక్యూరిటీల భారీ భద్రత, బందోబస్త్ నడుమ సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. 97శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల సరళిని, పోలింగ్ ప్రక్రియను పాల్వంచ ఆర్డీఓ మంగీలాల్, కౌంటింగ్ కేంద్రాన్ని మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, ఏరియా జీఎం దుర్గం రామచందర్‌లు పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ అనంతరం పీవీ కాలనీలోని కమ్యూనిటిహాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి బ్యాలెట్ బాక్సులను భారీ బందోబస్త్ నడుమ తరలించారు. రాత్రి 7గంటల నుంచి ఆర్డీఓ మంగీలాల్ పర్యవేక్షణలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి తివారీ ఆధ్వర్యంలో కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. రాత్రి సింగరేణి ఎన్నికల ఫలితాలు వెలువరించారు.



పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్, సెక్యూరిటీ బందోబస్త్



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాఘవేంద్రరావు, జీఎం రామచందర్

ఓడినా, గెలిచినా ప్రజాసేవలోనే..



సమావేశంలో మాట్లాడుతున్న పొదెం వీరయ్య

భద్రాచలం: ఇచ్చిన మాటకు కట్టుబడి భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. బుధవారం భద్రాచలంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా తీర్పును శిరస్సా వహిస్తానని, ఓడినా గెలిచినా భద్రాచలం ప్రజల సేవలోనే గడుపుతానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేనప్పుడే పార్టీకు విధేయుడిగా ఉండి భద్రాచలం సమస్యలపై అసెంబ్లీలో పోరాటం చేశానని గుర్తు చేశారు. భద్రాచలం అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరుగుతుందని, దీనికి కృషి చేస్తానని వెల్లడించారు. ఆరు గ్యారెంటీలకు సంబంధించి అర్హులైన వారందరూ అప్లికేషన్ ఫామ్‌లను నింపి గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు అధికారులకు అందజేయాలని సూచించారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బలుసు నాగ సతీష్, కాంగ్రెస్ నాయకులు తమళ్ళ వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు సుధీర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంతాల రాజేశ్వరి, తుమ్మల రాణి, మద్దేటి జయ, కట్ట కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

'పెసా' సభల ద్వారా ఎంపిక చేయాలి

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ చట్టాలను గౌరవించి లబ్ధిదారుల ఎంపికను పెసా గ్రామసభల ద్వారా జరపాలని ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లూరు డిమాండ్ చేశారు. బుధవారం అంజిపాక గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గ్యారెంటీలను ఆదివాసుల ప్రాంతంలో ఆదివాసుల చట్టాలకు లోబడి పెసా గ్రామసభల్లో మాత్రమే ఎంపిక జరపాలని డిమాండ్ చేశారు. ఆదివాసుల చట్టాలు, హక్కులను తుంగలో తొక్కే విధంగా చేయవద్దని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కుదుముల నాగేశ్వరరావు, సొందే గంగయ్య, అప్క రామ్మూర్తి, భీమరాజు, సోమేశ్వరరావు, సీతయ్య సింగరాజు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపన

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం గ్రామంలోని ద్వాదశ జ్యోతిర్లింగ శివాలయంలో వైభవోపేతంగా జ్యోతిర్లింగాల ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో వేద పండితులు రాఘవ శర్మ, యశ్వంత్ శర్మ, నూతన శర్మ, జోజి శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా వేదమంత్రోచ్చారణతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు.

మతతత్వ బీజేపీని గద్దె దించుదాం



మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, పక్కన మల్లు నందిని

చండ్రుగొండ: కేంద్రంలోని మతతత్వ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యంగా కాంగ్రెస్‌పార్టీ ప్రతి కార్యకర్తా పనిచేయాలని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్, అమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు మల్లు నందిని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్ ఆధ్వర్యంలో చండ్రుగొండలోని రైతువేదికలో బుధవారం ఏర్పాటు చేసిన సేవాదళ్ శతాబ్ది ముందుస్తు సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నదే కార్యకర్తల లక్ష్యం కావాలన్నారు. దేశంలో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలని, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేద్దామని వారు పిలుపునిచ్చారు. మల్లు నందిని పదేళ్ళుగా అమ్మ ట్రస్టు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు ప్రసన్న, మోత్కూరి ధర్మారావు, దారం గోవిందరెడ్డి, యండి.అన్వర్, సంకా శంకర్, బడుగు కృష్ణవేణి, బొర్రా సురేష్ పాల్గొన్నారు.

జనవరి 5 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

చర్లరూరల్: నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 5 నుంచి చర్ల మండలం సుబ్బంపేట గ్రామంలో చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు (నాలుగు) మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమ్మక్క, సారక్క వాలీబాల్ టోర్నమెంట్ పేరుతో జరిగే ఈ టోర్నమెంట్ లో పాల్గొనే జట్లు జనవరి 2 లోగా 8897529795, 9014065937 నంబర్లకు ఫోన్ చేసి తమ టీమ్‌లను రూ.800 లు చెల్లించి ఎంట్రీ నమోదు చేసుకోవాలని.. ఈ టోర్నీలో మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, చతుర్థి బహుమతి రూ.5 వేలుతో పాటు షీల్డులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు వాసం ముసలయ్య, కుర్సం రాంబాబు, ఉబ్బ చంటి, కాక చందులు తెలిపారు.

పోలింగ్ సరళి పరిశీలన

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని గనులలో జరుగుతున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల సరళిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలు సందర్శించి పరిశీలించారు. అనంతరం ఐఎన్‌టీయూసీ క్యాంపెయినింగ్ శిబిరం వద్ద ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఉద్యోగి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఏ విధంగానైతే మార్పు కోరుకుని కాంగ్రెస్‌ని గెలిపించారో.. గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో కూడా కార్మికులు గడియారం గుర్తుకు ఓటు వేసి ఐఎన్‌టీయూసీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న సీఎంఓ సైదులు

ములకలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ (సీఎంఓ) సైదులు ఉపాధ్యాయులకు సూచించారు. మండలపరిధిలోని మాధారం యూపీఎస్‌లో బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్నతి (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమ అమలు విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. రికార్డులను పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం సీతారంపురం గ్రామంలో ఫిజియోథెరపీ క్యాంపును సందర్శించారు.

న్యాయవాదులకు సన్మానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో బుధవారం బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని అధ్యక్షుడు కోటా దేవదానం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అర్ధశతాబ్దానికి పైగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ.. మూడు నేర ప్రక్రియ స్మృతులకు ప్రత్యక్ష తార్కాణంగా నిలిచిన పాపినేని కృష్ణ కుమార్, మాదిరెడ్డి వెంకట రమణారావులను ఘనంగా సన్మానించారు. సెషన్స్ కోర్టుల వికేంద్రీకరణలో భాగంగా భద్రాచలంలో ఒక ఫాస్టుట్రాక్ సెషన్స్ కోర్టును ఏర్పాటు చేయాలని సభ తీర్మానం చేసింది. అందుకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దుమ్ముగూడెం: మండలంలోని కె.రేగుబల్లి-2 బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని జలకం అరుణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 14, 15, 16 తేదీల్లో కిన్నెరసానిలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకావడంపై పాఠశాల హెచ్‌యం భారతమ్మ, పీఈటీ విజయ, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు కిన్నెరసానిలో శిక్షణ ఇవ్వనున్నారు.

ఘనంగా మహా పడిపూజ



పడిపూజలో మాలధారులు

గుండాల: మండల కేంద్రంలో హరిహరసుతుడు అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. దివంగత మానాల భద్రయ్య-శాంతమ్మల జ్ఞాపకార్థం మానాల వెంకన్న-ప్రమీలరాణి, మానాల ప్రణీత్-యశస్విని దంపతుల ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలో వీధుల వెంట అయ్యప్పలు వివిధ రకాల వేషధారణలతో నగర సంకీర్తన చేశారు. డోలు చప్పులతో నృత్యాలు చేశారు. వేద పండితులు కేతముక్కల పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో పడిపూజ, అయ్యప్ప అభిషేకం నిర్వహించారు. కోదాడ భాస్కర్ గురుస్వామి బృందంచే భజన కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో మానాల నారాయణమూర్తి, వీరన్న, ప్రభాకర్, సతీష్, శ్రావణ్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

'ప్రజా పాలన'కు సన్నద్ధం

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ ఆరు గ్యారెంటీల అమలుకు దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ, పోలీస్ అధికారులు కింది స్థాయి అధికారులతో బుధవారం సమావేశాలు నిర్వహించారు. చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఆయా సూచనల ప్రకారం.. నేటి నుంచి జనవరి 6వ తారకు వరకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరిస్తారు. ఈ సభలు ఆయా గ్రామాల్లోని పంచాయతీ ఆఫీసులు లేదా రైతు వేదికల్లో జరుగనున్నాయి. గ్రామ సభ ముందు రోజే దరఖాస్తులను అధికారులు ఇళ్లకు వచ్చి అందిస్తారు. దరఖాస్తు తీసుకునేటప్పుడుగాని, నింపాక సమర్పించే సమయంలోగాని ఎటువంటి డబ్బు, ఎవరికీ చెల్లించాల్సిన అవసరం లేదు. అప్లికేషన్‌కు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లను జతచేసి నిర్ణయించిన తారీఖున నిర్ణయించిన స్థలంలో ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తారు. ఆయా గ్రామసభల్లో అధికారులు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.



దమ్మపేట: సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధవి



మణుగూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మణుగూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాఘవరెడ్డి



భద్రాచలంఅర్బన్: మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్



అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్



గుండాల: ప్రజాప్రతినిధులతో సమావేశమైన సీఐ రవీందర్